# నందనవనం - 2

ఆయన ఆవిడవైపు నిష్టూరంగా చూసి ''అది మా అమ్మపిలిచే ముద్దుపేరు... మా నాన్న స్కూల్లో రాయించిన అసలు పేరు... శుభాంశు రాయ్... తెలుసా...!'' అంటూ ఠీవిగా చూశాడు.

''మరి... నా పేరుకి లక్ష్మీదేవనే అర్థమని... లచ్చిందేవిని మార్చారుగా... అసలు పేరయితే శ్రీవల్లి!... అయినా 'సుబ్బు' పేరుకేం వచ్చిందీ దొబ్బుడాయి... శుభ్రంగానే ఉందిగా...!'' కసిరినట్లుగా చూసింది.

అంతకన్నా విసురుగా ఆయన సమాధానం చెప్పాడు ''ఏం, శ్రీవల్లీ అంటేనే బావుందా... లచ్చిందేవీ అనే పేరుమాత్రం ముద్దుగా లేదా...?''

సూర్యం ఇద్దరివైపు చూస్తూ పెద్దగా నవ్వాడు.

ఆయన అతనివైపు కోపాన్ని నటిస్తూ చూసి ''ఏమిటయ్యా... నీలో కొంచెం నారదాంశ ఏదో ఉన్నట్లుంది...! లేకపోతే, మేం కొంచెం పోట్లాడుకున్నట్లుగా మాట్లాడుకుంటేనే పకపక లాడతావూ...?'' అన్నాడు.

''మీరు నిజంగా పోట్లాడుకుంటున్నట్లుగా లేదండీ బాబూ...! మీ ఇద్దరి మాటల్లోనూ నిరసన, నిష్టూరం చాలా కొంచెంగానూ, మురిపెం... ముచ్చటా ఎక్కువగానూ ఉన్నాయి! అందుకే నేను ఆనందంగా మీ ఇద్దరితీరునూ చూస్తున్నాను. నిజం కాదని మీరే చెప్పండి చూద్దాం!'' సవాలు చేస్తున్నట్లుగా అన్నాడు.

ఇంతలోనే 'నాన్నా...' అన్న పిలుపుకి అందరూ వెనక్కి తిరిగి చూశారు.

''మీరిక్కడ కూర్చున్నారా... బండిని వెనక్కి పంపించేసి మీరిద్దరూ నడుచుకుంటూ వస్తున్నారని దాసు దగ్గర్నుండి ఫోను వచ్చేసరికి... నేనే బయలుదేరి వచ్చాను.'' బండి పక్కన

నిలబడిన యువకుడు ఆ మాటలు అంటూనే అక్కడ నిలబడిన అతనిని చూస్తూ తల్లితండ్రుల్ని ఎవరన్నట్లు కళ్ళతోనే ప్రశ్నించాడు.

శ్రీవల్లి కొడుకుకి దగ్గరగా జరిగి పరిచయం చేస్తున్నట్లుగా చెప్పింది.

‘‘ఇక్కడ మూడుదార్లు కనుపిస్తున్నాయా, మాకేమో ఎటు వెళ్ళాలా అని సందేహం వచ్చి ఈ పొలంలో ఉన్న ఈ అబ్బాయిని శ్రీపురానికి దారి అడిగాం. ఇతని పేరు సూర్యం. మమ్మల్ని కూర్చోబెట్టి తీయని కొబ్బరినీళ్ళతో మర్యాద చేశాడుకూడానూ...’’ అంటూ ‘‘మా అబ్బాయి రామం’’ అని సూర్యానికి పరిచయం చేసింది.

‘‘అవునవును.. అడుగు పెట్టగానే ఆదరంగా మాట్లాడి ఆత్మీయుడైపోయాడు! చిన్నవాడని నాకు శిష్యుడని చెప్పవచ్చుగానీ నిజానికి గురువులాంటివాడు...!’’ అని ఆయన అనగానే మిగతా ముగ్గురూ ‘‘అదేమిటీ...?’’ అంటూ ఆశ్చర్యంగా చూశారు.

‘‘గురువని ఎందుకన్నానంటే... మొదటి పరిచయంలోనే ఒక విషయం ఇతని దగ్గర్నుండి నేర్చుకున్నాను! అదే... ‘మంచి మాటతోనే మనసుల్ని గెలుచుకోవచ్చని...!’ చూడు... మరి మొదటి పరిచయంలోనే మీ అమ్మనాకట్టుకుని రెండో కొడుకు పోస్టు కొట్టేయగలిగాడు...!’’ అంటూ ఆయన చిన్నగా నవ్వాడు.

‘‘అది... అది... నా అదృష్టం మాత్రమే నండి...!’’ అంటూ సూర్యం చేతులు జోడిరచాడు. కళ్ళూ చెమ్మగిల్లాయి. ఆయన సూర్యం భుజం తట్టి, కొడుకుని చూస్తూ ‘‘ఇంటిపని ఎంతవరకూ వచ్చిందీ...?’’ అనడిగాడు.

‘‘మీరు చెప్పినట్లే నా అభిరుచి ప్రకారం అధునాతనంగా కాకుండా తాతగారి ఇంటిని మరపించేట్లు కాదు గానీ, తలపించేట్లుగా తయారుచేశా. మీరు చూసి ఇంకా ఏమేమి మార్పులు చెబుతారో అవీ... చేయిద్దాం...!’’ అన్నాడు చిరునవ్వుతో.

‘‘నాకు మాత్రం ఏం తెలుసూ... మా నాన్న చెప్పిన వర్ణనలను బట్టి నీకు పురమాయించాను...!’’ అనగానే రామం తండ్రితో ‘‘తాతయ్యకు ఫోటోలు పంపించేశాను. చూసి అచ్చంగా అరుగులబడిలానే ఉందన్నారు. కాకపోతే కొత్తగానూ ఉందీ, బావుందీ అని మెచ్చుకున్నారు! అంతేకాదు నాన్నా... ‘ఈ కొద్ది రోజుల్లోనే తాపీపని, తోటపనీ అన్నీ ఎలా నేర్చేసుకోగలిగావురా’ అంటూ ఆశ్చర్యపోయారు కూడా...!’’ అన్నాడు ఆనందంగా.

‘‘అంటే... అన్ని రకాల పనులూ చేస్తున్నట్లుగా ఫోటోలు తీసుకుని పంపించటం కూడా జరిగిపోయిందన్నమాట! అవునూ... నిన్ననో, మొన్ననో పది పాడి ఆవుల్నీ, గేదెల్నీ కొన్నావని చెప్పావుకదా, వాటి పక్కనా నిలబడి ఫోటో తీయించుకుని పంపితే, పశువుల కాపరి పదవినీ సమర్థంగా నిర్వహిస్తున్నట్లుకూడా ఓ సర్టిఫికెట్ దక్కేది కదా...!’’

ఆయన మాటలకు ఆవిడ అడ్డం వచ్చింది. ‘‘ఏమంటున్నారు...? ఆ పనులేవీ చేయకుండా ఫోటోలకి ఫోజులు మాత్రమే ఇచ్చివుంటాడని మీ అభిప్రాయమా...? అసలు చూస్తూనే ఉన్నారుగా, మనకోసం రెండెడ్లబండిని ఒక్కడే నడుపుకుంటూ వచ్చాడు కదా...?’’

అప్పుడాయన ఉలిక్కిపడినట్లుగా చూసి ‘‘అవును రామూ... నువ్వు బండితోలటం ఎపుడు నేర్చుకున్నావురా...?’’ అనడిగారు కొడుకుని.

రామం మొహమాటంగా చూసి ‘‘ఏదో విమానం నడిపినట్లుగా ఆశ్చర్యపోతున్నారేంటీ! బండి తోలటం బ్రహ్మవిద్యేం కాదుగా! ఈ ఊరికి వచ్చినరోజే కుర్రాళ్ళతో కలిసి బండి మీద తిరిగాను. రెండు రోజుల తర్వాత నేనే ఇంటి పనులకి కావల్సిన వాటిని బండిపై తీసుకు వచ్చాను. ఇదిగో ఈ వేళ మీకోసం.. ఇంటివరకూ నడవాలంటే కొంచెం దూరం ఎక్కువే...! పదండి, బండి ఎక్కండి....’’ అన్నాడు.

ఆయన ఆప్యాయంగా కొడుకు చెంప నిమిరాడు. ‘‘ఈ కొద్ది రోజుల్లోనే అన్ని పనులూ నేర్చేసుకున్నాడు... చురుకుదనంలో వీడు అంతా నా పోలికే...!’’

ఆవిడ యథాప్రకారం నవ్వుమొహంతోనే నోరు సాగదీసింది. ''మీరీ మాట అంటారని నాకు తెలుసు. వెనక అన్నీ అమర్చి పెట్టేవాళ్ళుంటే ఏ పనులైనా చిటికెలో చేసెయ్యగలరు మరి...!''

''అంతేనండీ... ప్రజ్ఞా పాటవాలతో ప్రదర్శన ఇచ్చేవాళ్ళకి అన్నీ అమర్చిపెట్టేవాళ్ళు వెనకే ఉంటారు... ఉండిపోతారు..!'' నవ్వు మొహంతో అన్న సూర్యం, ఆయన తనవైపు చురుగ్గా చేసేసరికి, తప్పుగా మాట్లాడానేమోనని తడబడినట్లుగా మొహం పెట్టాడు.

సూర్యాన్ని ఆ విధంగా చూసిన ఆయన సరదాగా నవ్వి భుజం తట్టేసరికి స్థిమితపడి చిరునవ్వు చిందించాడు.

ఆయన కొడుకుతో ''మేం ఇద్దరం మా రెండుకాళ్ళ వాహనంతోనే రోడ్డుకి అటూ ఇటూ ఉన్న పచ్చని పొలాల్ని చూసుకుంటూ నెమ్మదిగా ఊళ్ళోకి చేరదామని అనుకున్నాం... నువ్వు బండి తీసుకుని బయలుదేరి వెళ్ళిపో... ఊళ్ళోకి రాగానే ఎవరిని అడిగినా 'అరుగులబడి వీధి'కి దారి చెబుతారని అన్నారుగా...!'' అన్నాడు.

''భలే చెప్పావు నాన్నా... నేను ఒక్కడినీ వెళ్ళాలా... అదేం కుదరదు. మీరూ బండి ఎక్కాల్సిందే...! మీరెలా నడుస్తారో, అంతే నిదానంగా ఈ రెండెడ్లబండీ వెళ్తుంది... ఉరకులూ, పరుగులూ ఏం ఉండవు. కాకపోతే కాలినడకన కాకుండా కూర్చుని కళ్ళతోనే పొలాల అందాల్ని ఆస్వాదించండి... ఆ పైన ముగ్గురం కబుర్లూ కలబోసుకోనూ వచ్చు...!'' అంటూ రామం చిన్నగా నవ్వాడు.

సరేనన్నట్లుగా తలవూపి రామంతో పాటూ వాళ్ళిద్దరూ బండి దగ్గరకు చేరారు, వెనకే వాళ్లతో వచ్చిన సూర్యం వాళ్ళు బండి ఎక్కటానికి సాయం చేశాడు.

వాళ్ళు బండి ఎక్కి కూర్చున్నాక సూర్యం వీడ్కోలు పలుకుతున్నట్లుగా చేతులు జోడిరచాడు. వాళ్ళు కూడా చేతులు వూపుతూ ''మళ్ళీ కనిపిస్తావుగా'' అనగానే అతను

''ఒక్కసారే కాదండీ, ఈ వూళ్ళో ఉన్నన్ని రోజులూ ప్రతిరోజూ వచ్చి మిమ్మల్ని కలుస్తానండీ...!'' అన్నాడు.

బండి కదలగానే రామం కబుర్లు మొదలు పెట్టాడు.

''నాన్నా... ఈ ఊరు రాకముందు ఏమో అనుకున్నా గానీ, ఇపుడు చూస్తే మాత్రం అబ్బో... సౌకర్యాల్లో ఏ నగరానికీ తీసిపోనట్లుంది! పేరుకి మాత్రమే పల్లెటూరు. అయితే ఈ ఊరివాళ్ళను మెచ్చుకోవాల్సిన అంశం ఏమిటంటే... అధునాతన సౌకర్యాలను అందిపుచ్చుకున్నారు గానీ పల్లెటూరు అందాలను పోగొట్టుకోకుండా కాపాడుకుంటున్నారు! అందువలనే ఈ ఊరు ఎవరికైనా నచ్చుతుంది! మనం ఇక్కడే కొన్నేళ్ళు ఉండాలంటే ముందు బెంగపడ్డానుగానీ, ఇపుడదేం లేదు, చాలా సరదాగా, హుషారుగా ఉంది! ఊళ్ళో కొన్ని మాత్రమే పూరిపాకలు, పెంకుటిళ్ళు ఉన్నాయి గానీ మూడొంతులు అన్నీ పెద్ద పెద్ద భవంతులే!''

''అయితే, మనది పెంకుటిల్లుకదా, ఊళ్ళో ఉన్న ఇళ్ళల్లో మనదే తీసికట్టుగా ఉంటుందా?'' అంది శ్రీవల్లి.

''ఏదైనా పెద్ద ఇల్లు చూసుకుందామంటావా...?'' అని ఆయన అడిగిన ప్రశ్నకి ఆవిడ ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ''ఛ...ఛ... అదేం కాదు...'' అంటూ తల అడ్డంగా వూపింది.'' అయ్యవారి అరుగుల బడి వీధి, ఇల్లూ...' అంటూ మీ తాతగారిల్లు పేరు తెచ్చుకుందా, అలాగే ఎంత సాదాసీదాగా ఉన్న ఇంట్లో ఉంటున్నా, మనుష్యులవలనే ఇంటికి పేరు రావాలి! మనిషికి కూడా అందచందాలవలన కాకుండా వ్యక్తిత్వం వలనే గుర్తింపు, గౌరవం దక్కాలని మీరూ అంటూ ఉంటారా... మరి నేను మాత్రం ఇంకోలా ఎందుకనుకుంటానూ...! అసలు మనం ఈ ఊరు వస్తున్నదే మీ తాతగారి పేరు నిలబెట్టటం కోసం గానీ చెడగొట్టటానికి కాదుగా...! ఎ.సి. లాంటి సౌకర్యాలు, నగరాల్లోని విలాసాలూ కావాలని నేనెపుడూ కోరుకోనని మీకూ తెలుసుగా, మనం కలిసి ఉండటం మాత్రమే ముఖ్యం... ఎక్కడైనా ఒకటే... మిగతావన్నీ ముఖ్యం కానేకాదు!''

ఆయన నిట్టూర్చాడు. ''అది నాకూ తెలుసు. మనం ఎలాంటి చోట అయినా ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఇమిడిపోగలం...! అయితే రామం గురించే కొంత ఆలోచన... వాడికీ....'' అంటూండగానే రామం జవాబిచ్చాడు ''ఏమిటి నాన్నా మీ సందేహం! నాకు మాత్రమే సౌకర్యాలు కావాలా...? మీతో కలిసి ఎలాంటి చోటనైనా నేనూ ఆనందంగా ఉండగలను! పూరిల్లా, పెద్ద భవంతి అన్నది ప్రశ్న కాదు. అయినా మీకు ముందుగానే చెప్పాగా, నాకు ఈ ఊరు బాగా నచ్చిందని! ఇక ఇల్లు సంగతి అంటే... బాగా పుచ్చిపోయిన చెక్క తలుపులు, దూలాలు లాంటివన్నీ మార్చాల్సి వచ్చింది! అందువల్ల అదే తరహాలో తయారైన కొత్త ఇల్లు రూపు వచ్చింది...! నాకు నచ్చింది, మీకూ నచ్చుతుంది!ఎలాంటి సందేహాలూ లేకుండా హాయిగా ఉండొచ్చు!''

''అది సరేగానీ రామూ, ఒక మంచి హుషారైన పాట అందుకో...!'' తండ్రి మాటలకు కొంచెం ఆశ్చర్యంగా ''ఏమిటి నాన్నా... మీరనేదీ...?'' అనడిగాడు.

ఆయన సెల్‌ఫోన్‌లో ఏదో చూపిస్తూ ''ఇలాంటి పాట...'' అనగానే అతడు కొంచెంగా వెనక్కి చూసి చిన్నగా నవ్వాడు. ''పాత సినిమాపాటలో వాళ్ళున్నట్లు... మీరు పగ్గాలు పట్టుకుని నిలబడి హుషారుగా పాడితే, అమ్మ కూడా నవ్వులు రువ్వుతూ పక్కన నిలబడుతుంది! అపుడు సరిగ్గా ఆ సినిమాలోని సీన్‌లాగే ఉంటుంది! ఇష్టమైతే అమ్మకూడా పాట అందుకుంటుంది. నేను లోపల ఆనందంగా వింటూ కూర్చుంటాను...!''

శ్రీవల్లి కల్పించుకుంది. ''ఈ కాసేపటిలోనే పాటలూ పద్యాలూ ఎందుకూ... అవిగో ఎత్తైన బిల్డింగులు కనబడుతున్నాయి. ఊరు దగ్గిరకొచ్చేసామన్న మాటేగా!'' అంది.

ఆయన కూడా నవ్వుతూ అన్నాడు ''అవును... ఈ చల్లగాలికి అటూ ఇటూ మెల్లగా ఊగుతున్న పచ్చని పైర్లని చూస్తూంటే చాలా సరదాగా, హాయిగా అనిపించి... హుషారైన పాటకూడా వింటోంటే ఇంకా బావుంటుంది కదాని అన్నా. ఊరుకి బాగా దగ్గరపడ్డాం.... ఎవరింట్లోనో శుభకార్యం జరుగుతూందేమో, మేళం వినిపిస్తోంది...!''

కాసేపటిలోనే ఊరులోకి ప్రవేశించిన బండి ఒక వీధిలోకి మలుపు తిరుగుతూ ఉంటే రామం పెద్దగా అన్నాడు ''ఎక్కడో కాదు, మేళతాళాలు మనింటిముందే, నేను బయలుదేరేటపుడు ఏ హడావుడీ లేదు, అదేమిటీ... ఇపుడు ఇంతమంది జనం చేరారూ...?''

విస్మయంగా రామం అంటూండగానే బండి ఇంటిముందు ఆగింది. జనం అంతా బండి దగ్గరకు వచ్చేశారు. పూల జల్లుతో స్వాగత సత్కారం చేశారు. ఆయన చాలా మొహమాటంగా ''ఇదేమిటీ ఇంత హడావుడీ... మా ఊళ్ళో మీ అందరి మధ్యా ఉందామని ఇంటికి వచ్చాం... అంతేకదా...!'' అన్నాడు ఇబ్బందిగా చూస్తూ.

ఒకాయన ఎవరో అన్నాడు ''అదేకదండీ మా ఆనందం కూడా! ఇన్నేళ్ళ తర్వాత మేం, మా పెద్దవాళ్ళద్వారా విన్న గొప్ప మనిషి సుబ్బరాయ శర్మగారి మనవడు ఈ ఊరికి రావటం మా అదృష్టంగా భావిస్తున్నాం...!''

ఇంకొకాయన అన్నాడు. ''ఆరుగుల బడి అయ్యవారు కట్టించిన స్కూల్లో చదువుకుని, పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్న మా పిల్లలంతా ఆ అయ్యవారికి ఋణపడి ఉంటారండీ! ఆ మహానుభావుడి గురించి వినటమే తప్ప మేం చూసింది లేదు, ఆయన వారసుడికైనా మా సంతోషం తెలియజేయాలనీ...!''

''అవును.... మా పిల్లలు దేశవిదేశాల్లో పెద్ద ఉద్యోగాలు చేస్తున్నా స్వంతవూరిని మరిచిపోలేదు! పెద్ద పెద్ద బిల్డింగులు కట్టించారు. పరిశుభ్రమైన రోడ్లు లాంటి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి సంపన్న గ్రామంగా తీర్చిదిద్దారు.!'' ఆనందంగా ఇంకొకరు అన్నారు. సుబ్బరాయ శర్మగారి మనవడు అనబడే ఆయనా ఆనందంగా తలవూపుతూ ''మీరన్నది నిజమే. ఒక పెద్ద విద్యాలయాన్ని స్థాపించటమే తాతగారు చేసిన పని, పిల్లలంతా బాగా చదువుకుని వూరునూ అభివృద్ధి పరిచారు! ఇది అసలైన ఘనత! తాతగారి గురించీ, ఈ ఊరు గరించీ నేనూ వినటమే కదా, అందుకే... చూసి, ఈ ఊళ్ళో, ఈ ఇంట్లో ఉండాలనే ఇష్టంతో కుటుంబంతో సహా వచ్చానూ...!'' అన్నాడు.

'చాలా సంతోషం' అనే మాటనే అక్కడున్న వాళ్ళందరూ అన్నారు.

శ్రీవల్లి కూడా అక్కడికి వచ్చిన ఆడవాళ్ళతో పరిచయం చేసుకుంటూ మాటలు కలుపుతూ లోపలకు వెళ్ళి ఇల్లంతా తిరిగి చూసి సంతృప్తిపడింది.

ఆడవాళ్ళంతా కూడా ఆవిడతో ఒకే మాట అన్నారు ''ఇంతలా పాడుబడిపోయిన ఇల్లు నివాసయోగ్యంగా మారటానికి, ఎన్నాళ్ళు పడుతుందో అనుకున్నాం. కానీ మీ అ అబ్బాయి చేతిలో మంత్రమేదో ఉన్నట్లుగా ఇట్టే పనులు పూర్తయిపోయాయీ..!''

ఆవిడ పెదవుల పైకి చిరునవ్వు వచ్చింది. ''మా వాడు అంతే...! ఏదైనా తలచుకున్నాడంటే, అది పూర్తయ్యే వరకూ వేరేదాని మీద ధ్యాస పెట్టడు.!'' ఆమె మాటల్లో కొడుకు గురించి మురిపెం, రవ్వంత గర్వం తొంగి చూసాయ్!

ఒక పెద్దావిడ మొహం నిండా నవ్వు పులుముకుని సంతోషంగా అంది ''మీ కాబోయే కోడలో కాదో తెలియదుగానీ మీ అబ్బాయితో కలిసి పనులన్నీ చాకచక్యంగా చక్క బెట్టింది! పెద్ద చదువే చదువుతోందనీ అన్నారు..!''

ఆవిడ మాటలకు ఉలిక్కి పడిన శ్రీవల్లి ఆశ్చర్యాన్ని ప్రకటించకుండా తనని తాను కట్టడి చేసుకోగలిగింది! చిరునవ్వును పెదవుల పైకి రప్పించింది!

కబుర్లు, కులాసా ప్రశ్నలు పూర్తయ్యాక మళ్ళీ కలుస్తామంటూ చెప్పి ఎవరిళ్ళకు, వాళ్ళు బయలుదేరి వెళ్ళిపోయారు. అందరూ తెచ్చిన పళ్ళు, కూరగాయలను సర్దుకోవటానికే చాలా సమయం పట్టింది. ఇల్లు సర్దుకోవటం తప్ప కొన్నాళ్ళు, వంటపని పెట్టుకోవద్దని వచ్చిన వాళ్ళు చెప్పినా శ్రీవల్లి అంగీకరించలేదు. చివరకు ఆరోజు కి మాత్రం సరేనంది. వాళ్ళ ఆప్యాయతకు ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

సామాన్లు సర్దుకుంటున్నపుడు తనకి సాయం చేస్తున్న కొడుకుతో శ్రీవల్లి సరదాగా అంది. ''ఇంటి మరమ్మత్తులలో నీకు సాయం చేసిన నీ స్నేహితురాలు ఇల్లు సర్దుకుంటున్నవేళ రాలేదేం...? మాకు మాత్రం సాయం చేయదా...?''

అతను తల్లి వైపు ఆశ్చర్యంగా చూస్తుంటే, ఆవిడ చిన్నగా నవ్వింది.

''అడుగు పెట్టగానే ఎలా తెలిసిపోయిందనా నీ ఆశ్చర్యం..? నీకోమాట చెప్పనా? ఇప్పట్లో ఏ విషయం అయినా అందరికీ నిముషాల్లో చేరిపోతోందని అనుకుంటున్నామా.... ఇలాంటి ఆధునిక సౌకర్యాలేవీ లేని రోజుల్లో కూడా ఏ పల్లెటూరు లోనైనా సరే ఏ మాట అయినా అందరికీ ఇట్టే చేరిపోయేది.. తెలుసా ! రేపు అందరూ ఆ అమ్మాయి వివరాలూ, ఫొటోలూ అన్నీ చూపించకముందే, నువ్వే చెప్పేయి. ఏదైనా నీ ద్వారా ముందుగా మాకు తెలియటం బావుంటుంది. అవునా..?''

రామం కూడా సరదాగా నవ్వాడు. ''ఏ విషయం అయినా ముందుగా నీకు చెప్పలేదంటే... అర్థమేమిటీ... ఆ విషయానికంత ప్రాధాన్యం లేదనే కదా..! కానీ.... ఆదేదో ముఖ్యమైన విషయమన్నట్లుగా నువ్వడిగావు కనుక చెబుతున్నా. మా కాలేజీలోనే చదువుతోంది.. ఈ ఊళ్ళో నన్ను కలిసినప్పుడు తను చెబితేనే నాకూ తెలిసింది. ఇంతకు ముందు కాలేజీలో చూసినట్లు నాకు గుర్తు లేదు మరి! నేనీ ఊరుకు వచ్చి ఇల్లు బాగు చేయిస్తున్న విషయం తెలిసి సాయం ఏమైనా కావాలా అనడిగింది. ఇప్పుడు సెలవులు కదా. వాళ్ళదీ ఈ పక్కవూరేను... బాగా దగ్గిరేనట. కొంచెం చొరవ ఎక్కువే కాబోలు, నేను వద్దన్నా పనుల్లోకి ప్రవేశించి హడావుడి చేసేసింది. అందుకనే ఈ వూరి వాళ్ళంతా అమ్మాయి ఎవరూ, ఏమిటో అని వాకబు మొదలు పెట్టారు... అంతే....'' అని పూర్తిచేసి నవ్వుమొహంతో వింటున్న తల్లితో ''నేను నిజమే చెబుతున్నానమ్మా....!'' అన్నాడు.

ఆవిడ కొడుకు చెంపని ఆప్యాయంగా నిమిరి ''ఎవరితోనైనా ఏమోగానీ, నాతో మాత్రం నువ్వు నిజమే చెబుతావు ! నాకు తెలుసు..!'' అంది చిరునవ్వుతో, మళ్ళీ వెంటనే అడిగింది ''నీకు

అంతకుముందు చూసిన జ్ఞాపకం లేదు సరే, మరి ... ఇపుడు బాగా దగ్గర్నుండి గమనించావు కదా... అమ్మాయి గురించి వివరాలు చెబుదూ..!''

రామం చిన్నగా నవ్వేసాడు ''ఇపుడంటే... అవును ... కొంచెం గమనించాలే... చొరవ ఎక్కువే. తెలివితేటలూ.... తక్కువ కాదు... ఇక రూపం సంగతికి వస్తే... నీపక్కన నిలబడితే మాత్రం తేలిపోతుంది గానీ, విడిగా చూస్తే మాత్రం ఎవరికైనా బావుందనిపిస్తుంది..!''

''అబ్బ... ఈ రెండు మాటలూ చెప్పటానికి అంత మొహమాట పడుతున్నావెందుకో నాకు అర్థం కావటం లేదు... నీ వాలకాన్ని బట్టి. ఇదేదో చిన్న విషయం కాదూ ముఖ్యమైనదే అనిపిస్తోంది.. సరే నాతో పోల్చి... నన్ను మెప్పించటం కోసం చెప్పావో, నిజమో నేనే తేల్చుకుంటానుగానీ, వీలు చేసుకుని ఒకసారి ఇక్కడకు వచ్చి వెళ్ళమని ఫోనుచేయి. నెంబర్లు ఇచ్చి పుచ్చుకునే ఉంటార్లే...!'' అంటూ నవ్వింది

అలాగే అన్నట్లుగా ముసిముసి నవ్వుతో తలవూపిన రామం సెల్ ఫోన్‌తో పక్కకు వెళ్ళబోతోంటే ఆవిడ ''ఇపుడే చేయనక్కర్లేదు... అంత తొందరేం లేదులే, నిదానంగా తర్వాత చేద్దువు.'' అంది నవ్వుతూ.

రామం కూడా ఫక్కున నవ్వేసాడు. ''నువ్వేదంటే అదే, నీ మాట జవదాటనుగా...'' అంటూ సరదాగా మళ్ళీ నవ్వాడు.

''ఇలాంటి చిన్నచిన్న విషయాల్లో కాదు.. అవసరమైనపుడు ఈ మాటను గుర్తు చేస్తా''

''సరేనమ్మా నా మాటను నిరూపించుకునే అవకాశం వస్తే అలాగే చూస్తావుగా..'' అన్నాడు రామం చిరునవ్వుతో.

* * * * * *